క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నిడదవోలు: నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని కమిషనర్ కేవీ పద్మావతి ఆదివారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

వనితా క్లబ్ సేవలు ప్రశంసనీయం



లెప్రసీ కాలనీలో దుస్తులు అందిస్తున్న వాసవీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొర్లేపర కృష్ణాజీ, సభ్యులు

నిడదవోలు: వాసవీ వనితా క్లబ్ సభ్యులు చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని వాసవీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొర్లేపర కృష్ణాజీ కొనియాడారు. గవర్నర్ విజిట్ సందర్భంగా ఆదివారం వాసవీ వనితా క్లబ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మానసిక దివ్యాంగుల కేంద్రాని (హృదయాలయం)కి నిత్యావసరాలు, స్థానిక లెప్రసీ కాలనీలోని కుష్ఠు రోగులకు నూతన వస్త్రాలు, నలుగురి పేదలకు పింఛన్ల కింద నగదు, చిరు వ్యాపారులకు గొడుగులు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ కేదారిశెట్టి రవికుమార్, వనితాక్లబ్ అధ్యక్షురాలు దివ్వెల ఫణిమాధురి, కార్యదర్శి గొల్లపూడి గాయత్రి, కోశాధికారి జవ్వాది శిరీష, వాసవీ ఇంటర్నేషనల్ సహాయక కోశాధికారి కుసుమంచి పాపారావు, కనగర్ల విజయ రామకృష్ణ, మానేపల్లి వెంకటరమణ, చిలకల మల్లికార్జునరావు, కేదారిశెట్టి సునీత, పెరుమాళ్ల విజయ, జయవరపు లక్ష్మి, ఉద్దగిరి సత్యవతి, జల్లూరి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

96 మందికి రేషన్‌కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందిస్తున్న సర్పంచ్, నాయికులు

కొవ్వూరు: మండలంలోని ఐ.పంగిడి గ్రామానికి కొత్తగా 96 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. ఆ గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ గోశాల నాగర్జున, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, కాపవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు కామన రత్నాజీ చేతుల మీదుగా వాటిని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బోడా బ్రహ్మయ్య, బేడ,బుడగ జంగాల సంఘం అధ్యక్షుడు కప్పిరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ప్రధాన రోడ్ల విస్తరణ పనులు

నిడదవోలు: పట్టణంలోని గణేశ్ చౌక్ సెంటర్ నుంచి గణపతి సెంటర్ వరకు ప్రధాన రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రధాన రోడ్ల విస్తరణలో భాగంగా రెండో సీసీ రోడ్డు పనులు చేస్తున్నారు. ఆదివారం కూడా సీసీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. మున్సిపల్ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 కోట్ల వ్యయంతో నాలుగు లైన్ల సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ల వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ మాధవీలత, ఏఈ హేమంత్‌కుమార్‌లు రోడ్డు నిర్మాణ పనలను పరిశీలించారు.

రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

నిడదవోలు రూరల్: మండలంలోని పందలపర్రు శివారు రావివారిపాలెం నుంచి జీడిగుంట వెళ్లే రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకుడు పులుమంతుల రామారావు ప్రారంభించారు. రూ.38 లక్షల వ్యయంతో 90 మీటర్ల పొడవునా ఈ బీటీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు పీఆర్ స్పెషల్ ఏఈ ఎం.ఆల్‌స్టిన్ తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు శీలంశెట్టి సూర్యనారాయణ, పార్టీ నేతలు కాలాబత్తుల సూర్యప్రకాష్, భోగిరెడ్డి వరప్రసాద్, పినిశెట్టి సత్యనారాయణ, ఊబా సురేష్, నేదునూరి శ్రీనివాస్, చల్లా రామకృష్ణ పాల్గొన్నారు.

సర్పంచ్ భర్తకు మంత్రి వనిత పరామర్శ

కొవ్వూరు: మండలంలోని కుమారదేవం పంచాయతీ సర్పంచ్ కాసాని దుర్గ భర్త దుర్గారావును హోం మంత్రి తానేటి వనిత ఆదివారం పరామర్శించారు. దాదాపు ఇరవై రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ భర్త దుర్గారావుకు కాలికి బలమైన గాయమై బెడ్ రెస్ట్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మంత్రి వనిత కుమారదేవంలోని సర్పంచ్ ఇంటికి వెళ్లి దుర్గారావును పరామర్శించి ప్రమాదం ఎలా జరిగిందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు గన్నమని వీర వెంకట్రాజు, కుమారదేవం ఎత్తిపోతల పథకం రైతు సంఘం అధ్యక్షుడు గోలి శ్రీనివాస్, నాయకులు కోదూరి సత్యనారాయణ(సత్తులు), జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

లంకలు ... కకావికలం

- వశిష్ట గోదావరి మహోగ్ర రూపం
- రోజుల తరబడి ముంపులో ఉద్యాన పంటలు
- పశువులకు నీడ కరవు
- కన్నీళ్లు పెట్టుకుంటున్న రైతులు



ముక్కామల లంకలో నీట మునిగిన దొండ పందిరి

పెరవలి: వశిష్ట గోదావరి ఆదివారం ఉగ్రరూపం దాల్చింది. లంక భూములు అతలాకుతలమయ్యాయి. ఈ లంకల్లో సాగవుతున్న పంటలు ముంపులో ఉన్నాయి. పశువులకు గూడు కరవైంది. పచ్చిబయళ్లు నీట మునిగాయి. దాంతో ఏటి గట్లపైనే పశువులు సేద దీరుతున్నాయి. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. మండలంలోని కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, ముక్కామల, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల లంక భూముల్లోని కొబ్బరి, అరటి, కంద, కోకో, తమలపాకులు తోటలు, కూరగాయలు, ఆకుకూరలు, పూలతోటలు రోజుల తరబడి గోదావరి ముంపులో ఉన్నాయి. మండలంలోని 1,225 ఎకరాల్లోని ఉద్యాన పంటలు నీట మునిగాయని మండల ఉద్యాన అధికారి శ్రీనివాస్ తెలిపారు. రైతులు ప్రాణాలకు తెగించి పడవలపై లంకల్లోకి వెళ్లి అరటి గెలలను కోసి తెచ్చుకుంటున్నారు. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి సాగు చేసిన కంద పంట మొదళ్లతో సహా లేచి వరదలో కొట్టుకుపోతోంది. మండలంలో గోదావరి 13 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉండడంతో వేలాది ఎకరాల్లో లంక భూములు ఉన్నాయి. వాటిలో అరటి పంట 2 వేల ఎకరాల్లో, 150 ఎకరాల్లో కొబ్బరి, 200 ఎకరాల్లో పచ్చగడ్డి, 150 ఎకరాల్లో మొక్కజొన్న , 100 ఎకరాల్లో కంద, 50 ఎకరాల్లో పూలు, 300 ఎకరాల్లో ఆకుకూరలు, కూరగాయల పంటలు, 50 ఎకరాల్లో తమలపాకులు, 45 ఎకరాల్లో పామాయిల్, 40 ఎకరాల్లో జామతోటలు, 50 ఎకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్నారు. ముంపులో ఉన్న పంటలను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.



ముక్కామల లంక భూముల నుంచి పడవపై తెచ్చిన అరటి గెలలను గట్టుపైకి చేరుస్తున్న కూలీలు



పెండ్యాలలో నీట మునిగిన ఇసుక ర్యాంపు

నీట మునిగిన ఇసుక ర్యాంపులు

నిడదవోలు రూరల్: గోదావరి వరద ఉధృతికి మండలంలోని గోదావరి పరీవాహక గ్రామాలైన పెండ్యాల, జీడిగుంట, పందలపర్రు, రావివారిపాలెం గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. విజ్జేశ్వరం, ధవళేశ్వరాల నుంచి సముద్రంలోకి భారీగా వరద నీరు విడుదల చేయడంతో పెండ్యాల, జీడిగుంట గ్రామాల్లో గట్టుపక్కనే ఉన్న సుమారు 500 ఎకరాల్లోని పంటలు నీట మునిగాయి. పెండ్యాల పుష్కర ప్రధాన స్నానఘట్టం, కూర్చొనే బల్లలు, విద్యుత్తు స్తంభాలు, ప్రధాన ఇసుక ర్యాంపులు జలమయం అయ్యాయి. ఇప్పటికే అరటి, బెండ తోటల్లోకి వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు గట్టుపై నుంచి క్రమక్రమంగా పెరుగుతున్న గోదావరి ఉధృతిని తిలకిస్తున్నారు.



నిడదవోలు మండలం పందలపర్రులో ఇసుక ర్యాంపునకు వెళ్లే మార్గంలో వరద

గోష్పాదేశ్వరునికి లక్ష బిల్వార్చన



విశేష అలంకరణలో కొవ్వూరులోని గోష్పాదేశ్వర స్వామి వారు

కొవ్వూరు: స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలో కొలువైన గోష్పాదేశ్వర స్వామి వారికి ఆదివారం లక్షపత్రి పూజ నిర్వహించారు. అర్చకులు ముందుగా గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లలితాదేవికి కుంకుమార్చనలు చేశారు. తర్వాత రుద్రహోమం నిర్వహించాక భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి పూజలను పర్యవేక్షించారు.

ఉమాచోడేశ్వరునికి విశేష పూజలు

పట్టణంలోని పాత ఊరు ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చన, అమ్మవారికి శ్రీసూక్త విధానంలో కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకులు కొతవరపు భాను, దేవరకొండ ఉమా, దేవరకొండ సాయిప్రసాద్ పూజలను పర్యవేక్షించారు. మంత్రిప్రగడ సత్యనారాయణమూర్తి, శేషాద్రి రామారావు, పమ్మి రవిబాబు, కలిగొట్ల కృష్ణారావు, బల్లమూడి సత్యనారాయణ, వైవీఎస్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒకే కేంద్రంగా గ్రామ పాలన



పోచవరంలో సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే భవనాల ప్రారంభోత్సవ శిలా ఫలాకాన్ని ఆవిష్కరించి హోం మంత్రి తానేటి వనిత

- అందుకే సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- హోం మంత్రి తానేటి వనిత
- పోచవరంలో ఒకే చోట మూడు భవనాల ప్రారంభం

తాళ్లపూడి: గ్రామ పాలన అంతా ఒకే చోట నుంచి నిర్వహించాలన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభీష్టాన్ని సాకారం చేస్తూ, అందుకు అవసరమైన భవనాలను అందుబాటులోకి తెస్తున్నామని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని పోచవరం గ్రామంలో నిర్మించిన సచివాలయ, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆదివారం మంత్రి వనిత ప్రారంభించారు. సచివాలయ భవనాన్ని రూ.40 లక్షలు, రైతుభరోసా కేంద్రం భవనాన్ని రూ.21.8 లక్షలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని రూ.17.5 లక్షల వ్యయంతో గ్రామంలోని ఒకే ప్రాంతంలో నిర్మించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ నియోజకవర్గంలో మిగిలిన చోట కూడా ఈ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ కాకర్ల హేమలత, సొసైటీల అధ్యక్షులు కుంటముక్కల కేశవనారాయణ, ఎం. దొరబాబు, పోశిన శ్రీకృష్ణదేవరాయులు, మండిగ గిరి, నాయకులు సిద్దంశెట్టి కృష్ణ, దుగ్గిరాల శ్రీనివాస్, వల్లభని శ్రీహరి, ముళ్ల పోశిబాబు, ఎంపీడీవో వెంకటరమణ, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

3న చాగల్లు మండల సమావేశం

చాగల్లు: చాగల్లు మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం ఆగస్టు 3వ తేదీ ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో బి.రామ్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు, సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

కాలువలకు నీటి విడుదల

నిడదవోలు: రైతుల ఖరీఫ్ సాగు అవసరాల మేరకు జలవనరుల శాఖ, ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు ఉభయ గోదావరి జిల్లాల్లోని డెల్టా కాలువలకు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. దీనిలో భాగంగా పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1500 క్యూసెక్కులు, తూర్పు డెల్టాకు 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 675, తణుకు కాలువకు 314 , అత్తిలి కాలువకు 373 , నరసాపురం కాలువకు 1018 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఆపన్నులకు అండగా 'మానవత'

గోపాలపురం: ఆపదలో ఉన్న వారికి మానవత స్వచ్ఛంద సంస్థ అండగా నిలుస్తుందని ఆ సంస్థ జిల్లా విద్యా కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. ఆ సంస్థ మండల శాఖ సమావేశం ఆదివారం మండలంలోని చిట్యాల గ్రామంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవత సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి గోపాలపురం మండల శాఖ ప్రథమ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కె.గంగాధరరావు మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, అధ్యక్షుడు ముప్పన కృపావరప్రసాద్, నెల్లి చంద్రశేఖర్, ఎల్ఐసీ రాధాకృష్ణ, బూసి మురళీకృష్ణ, ఎలిపే నరేంద్ర పాల్గొన్నారు.

నిర్వాసితులకు మెరుగైన వసతులు

- అధికారులకు మంత్రి వనిత ఆదేశం
- మద్దూరు పునరావాస కేంద్రం సందర్శన
- మద్దూరులంకలో గోదావరి వరద పరిశీలన



పునరావాస కేంద్రంలో ముంపు నిర్వాసితులతో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: గోదావరికి వరద పోటెత్తడంతో మండలంలోని మద్దూరు జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న నిర్వాసిత కుటుంబాలను ఆదివారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పరామర్శించారు. ఈ కేంద్రంలోని సౌకర్యాలు, వసతుల గురించి నిర్వాసితులను ఆమె ఆరా తీశారు. వరద సాధారణ స్థితికి చేరేంత వరకూ వారిని పునరావాస కేంద్రంలోనే ఉంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇక్కడి వసతుల పట్ల బాధితులు సంతృప్తి వ్యక్తం చేశారు. 15 మత్స్యకార కుటుంబాలకు చెందిన 42 మంది ఈ పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్నట్టు కొవ్వూరు తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ మంత్రికి వివరించారు. అనంతరం మద్దూరులంక గ్రామంలో వరద చుట్టుముట్టిన ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. వరద ఉధృతి అధికంగా ఉన్నందున గ్రామంలో నిరంతర విద్యుత్తు సరఫరా అందించాలని, మెరుగైన పారిశుధ్యానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్తులకు కలుషితం కాని మంచి నీటిని అందించాలని సూచించారు. అధికారులు ఎప్పకప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి వనిత ఆదేశించారు. కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, మద్దూరు సర్పంచ్ బొలిశెట్టి రత్నకుమారి, నాయకు లు వస్కా రమేష్, మాజీ సర్పంచ్ కంచుమర్తి వెంకట్రావు, బొలిశెట్టి దుర్గారావు, తోట నారాయణ, దేవన సత్యనారాయణ, పెరుమాళ్ల ఉమామహేశ్వరరావు, ఉప్పులూరి సూరిబాబు, ఎంపీడీవో కె.సుశీల, జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ భరత్ దృష్టికి పొగాకు రైతుల సమస్యలు

దేవరపల్లి: రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను గోపాలపురం నియోజకవర్గంలోని పలువురు పొగాకు రైతులు ఆదివారం రాజమహేంద్రవరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలు వివరించారు. 2022–23 సీజన్‌కు బ్యారన్‌కు 35 క్వింటాళ్ల పొగాకు ఉత్పత్తికి అనుమతి ఇచ్చారని, దానిని 45 క్వింటాళ్లకు పెంచాలని కోరుతూ రైతులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యను కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో దేవరపల్లి, గోపాలపురం వేలం కేంద్రాల పొగాకు రైతు సంఘం ప్రతినిధులు నరహరిశెట్టి రాజేంద్రబాబు, ఉండవల్లి సత్యనారాయణ, సుంకవల్లి శ్రీనివాసరావు, ఆచంట సురేష్ తదితరులు ఉన్నారు.

127 మందికి కంటి పరీక్షలు

నిడదవోలు రూరల్: స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు సూచించారు. లయన్స్ క్లబ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో పురుషోత్తపల్లి రామాలయం వద్ద ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీఐ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. నిడదవోలుకు చెందిన రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల సిబ్బంది 127 మందికి కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు కూడా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు రంగా వెంకటేశ్వరరావు, కొమ్మిన వెంకటేశ్వరరావు, సుంకవల్లి కృష్ణ పాల్గొన్నారు.

ధ్యానంతో సమస్యలను అధిగమించవచ్చు

చాగల్లు: ధ్యానంతో సమస్యలను అధిగమించవచ్చని నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఏంఎ ప్రసాద్ అన్నారు. నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో చాగల్లు మండలం ఎస్. ముప్పవరంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ ధ్యానం ద్వారా మనిషి తన గురించి తాను తెలుసుకోవచ్చన్నారు. ధ్యానం వలన కలిగే లాభాలను ఆయన వివరించారు. ఎ.గంగాభవాని, బి.సత్యనారాయణ, ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు.

'మానవత' సంస్థకు విరాళాలు

దేవరపల్లి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు పలువురు దాతలు విరాళాలు అందజేశారు. స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద మండల శాఖ అధ్యక్షుడు ఈడ్పుగంటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీగెల లక్ష్మీనారాయణ రూ.50 వేలు, తీగెల బలరామయ్య రూ.25 వేలు విరాళంగా అందించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు రామిరెడ్డి గంగాధరరావు, కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావులు సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. మెరిట్ విద్యార్థిని ఓరుగంటి ప్రసన్నకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

దాసాంజనేయ స్వామికి లక్ష పత్రి పూజ

నిడదవోలు: స్థానిక గడ్డి బజారు వీధిలోని దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో ఆదివారం లక్ష పత్రి పూజ వైభవంగా నిర్వహించారు. అర్చకుడు రాజోలు బాలసుబ్రహ్మణ్య శివాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, తులసీ దళాలతో పూజలు చేశారు. పట్టణ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దివ్యాంగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి
- 10 మందికి మూడు చక్రాల స్కూటీల అందజేత
- పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్



దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు

దేవరపల్లి: దివ్యాంగులను రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకొంటోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని 10 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలను ఆదివారం పంపిణీ అందజేశారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ద్వారా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి, కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ చేతుల మీదుగా వాటిని దివ్యాంగులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ ఒక్కో స్కూటీ ఖరీదు రూ.1.20 లక్షలు అన్నారు. నిబంధనల మేరకు అర్హులైన దివ్యాగులందరికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో మూడు చక్రాల స్కూటీలు అందజేస్తామని చెప్పారు. నియోజకవర్గానికి మరో 40 స్కూటీలు అవసరమన్నారు. కార్పొరేషన్ ద్వారా దివ్యాంగులకు అవసరమైన పరికరాలను ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయసంస్థ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 1,550 మూడు చక్రాల స్కూటీలను పూర్తి సబ్సిడీతో లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది మరికొందరికి స్కూటీలు అందిస్తామని ఆమె తెలిపారు. దివ్యాంగులైన డిగ్రీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, చెవిటి, మూగ దివ్యాంగులకు టచ్ ఫోన్లు, వినికిడి యంత్రాలు, చంక కర్రలు, వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు. ఆ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా మేనేజరు బి.రామ్‌కుమార్ మాట్లాడుతూ సంస్థ ద్వారా ఇజ్రాలకు నెలకు రూ.3000 చొప్పున పింఛన్ అందజేస్తామన్నారు. అరవై ఏళ్లు పైబడిన వారికి వినికిడి యంత్రాలు అవసరమైతే సదరం సర్టిఫికెట్ అవసరం లేకుండానే వాటిని ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఆయిల్ పామ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, దేవరపల్లి, గోపాలపురం ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ కడిమి వీరకుమారి, వైఎస్సార్ సీపీ దేవరపల్లి, నల్లజర్ల మండల శాఖల అధ్యక్షులు కూచిపూడి సతీష్, గగ్గర శ్రీనివాస్, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, పార్టీ నాయకులు, సొసైటీల అధ్యక్షులు, సర్పంచులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై నిరసనల వెల్లువ



కొవ్వూరు మండలం ధర్మవరంలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



ఉండ్రాజవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాల సభ్యులు

కొవ్వూరు: మణిపూర్ ఘటనలపై పట్టణంలోను, మండలంలోను ఆదివారం నిరసనలు వెల్లువెత్తాయి. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.మణిపూర్ రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పాలని, నిందుతుల్ని కఠినంగా శిక్షించాలని, బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రధాన మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలు తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ పౌర సమాజం సంఘ నాయకులు దగ్గు రాధాకృష్ణ, బీర రవి, దైవ సేవకులు జోసెఫ్, ప్రసాద్, అనిల్, సీపీఎం నాయకులు ఎం.సుందరబాబు, పడాల గంగాధర్, మాల మహాసభ నాయకుడు బొంతా శ్యాం రవి ప్రకాష్‌లు పాల్గొన్నారు. అలాగే దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మెరకవీధి అంబేడ్కర్ విగ్రహం వద్ద మణిపూర్ ఘటనలకు నిరసన తెలిపారు. నిందుతులను తక్షణం అరెస్ట్ చేయాలంటూ నినాదాలు చేశారు. రిటైర్డు ఉద్యోగుల సంఘ నాయకుడు పెనుమాక జయరాజు, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, యూనిటీ స్టెంత్ అధ్యక్షుడు సాకా పుల్లారావు, పీతల సునీల్, వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలకు నిరసనగా మండలంలోని ధర్మవరంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు.యునైటెడ్ పాస్టర్ కొయ్య ప్రభాకరరావు, పాస్టర్స్ బి.బెన్నీ ప్రేమ్‌కుమార్, జె.మోహన్, వి జేసుదాసులతో పాటు ధర్మవరం సర్పంచ్ నేరేడుమిల్లి నాగమణి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జలాది రవికుమార్, వై.పోశారావు, జొన్నకూటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా మణిపూర్‌లో క్రైస్తవులపై సాగుతున్న దాడులకు నిరసనగా సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు కొవ్వూరు ఒకటో వార్డులోని శ్రీరామ కాలనీ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు క్రిస్టియన్ జేఏసీ కమిటీ నాయకులు ఆదివారం తెలిపారు.

నిడదవోలు: మణిపూర్‌లో క్రిస్టియన్లపై జరిగిన దాడులు, చర్చిల విధ్వంసాన్ని నిరసిస్తూ పట్టణానికి చెందిన చర్చ్‌పేట యూత్ ఆధ్వర్యంలో అక్కడి యువకళా సమితి వేదిక వద్ద ఆదివారం నిరసన తెలిపారు. మణిపూర్ ముఖ్యమంత్రితో పాటు కేంద్రం హోం మంత్రి అమిత్ షా రాజీనామా చెయ్యాలని కార్యక్రమానికి సారథ్యం వహించిన కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. గారపాటి ప్రసన్న, టి. కృష్ణ, నాని, టి.సర్వేశ్వరరావు లెనిన్ పాల్గొన్నారు

ఉండ్రాజవరంలో నిరసన ప్రదర్శన

ఉండ్రాజవరం: మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని కోరుతూ ఉండ్రాజవరం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆ గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆ రాష్ట్రంలోని క్రైస్తవులు, చర్చిల మీద జరుగుతున్న దాడులకు నిరసనగా ఉండ్రాజవరంలోని క్రీస్తు లూథరన్ దేవాలయం, బైబిల్ మిషన్ చర్చి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలన్నారు. మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.పాస్టర్లు ఆర్.ఇజ్రాయిల్, జి.పాల్ రాజు, విశ్వాసులు పాల్గొన్నారు.